


# ఉరి

తుమ్మేటి రఘోత్తమరెడ్డి

ఉదయం ఆరు గంటలు. ఒకటో నెంబరు బొగ్గు గని మీది సైరన్ తీరని ఆకలి గల రాకాసిలాగా కూసింది. ఆ కూతకు బెదరిపోయిన జనం గుదిగుచ్చినట్లున్న కార్మిక వాడల్లో ఆదర బాదరగా తిరుగసాగారు. వంటా, వార్పులతో, పిల్లల ఏడ్పులు, పెడబొబ్బలతో కార్మిక స్త్రీలు; డ్యూటీల యాతన చిరాకుతో కార్మికులు దట్టంగా లేచిన బొగ్గు పొగల మధ్య తిరుగాడుతుండగా దిగులు దిగులుగా 'కాలేరి' మేల్కొన్నది. సైరన్ కూతతో పాటు సీనియర్ కార్మికుడు తోట రామచెంద్రం ఉరేసుకున్నాడనే వార్త సుభాష్‌నగర్ బస్తీ అంతటా పాకింది.

ఉరేసుకుని చనిపోయిన రామచెంద్రం క్వార్టరుకు నాలుగు క్వార్టర్ల ఆవల గల క్వార్టర్‌లోని నారాయణకు మాత్రం ఈ చావువార్త ఇంకా అందలేదు. నారాయణ అంతు పొంతూలేని, ఆకారం లేని అనేక ఆలోచనలతో డ్యూటీకి తయారౌతున్నాడు. వీధిలో బెదురు ముఖాలతో పరుగెత్తుతున్న మనుషుల బెదురుకు కారణమేమిటో నారాయణకు అర్థం కాలేదు. 'ఇంత పొద్దున్నే వీళ్ళకేమచ్చిందను'కుంటూనే క్వార్టరు బయటకు వచ్చి నిలుచున్నాడు.

స్త్రీలు, పిల్లలు, డ్యూటీ బట్టలతోటే కొందరు కార్మికులు ఆందోళనతో, గందరగోళపు ప్రశ్నలు, జవాబులతో గొణుగుతూ పోతున్నారు. నారాయణ వాళ్ళందరి వేపు అనాసక్తంగానే చూశాడు. అట్లా పోతున్న వాళ్ళందరు కొద్ది దూరంలోనే గల తన చిరకాల మిత్రుడు రామచెంద్రం క్వార్టరు ముందు గుమిగూడడంతో నారాయణ వీధిలోకొచ్చి ఒకాయనను ఆపి "ఏమైంద్రా ఎవన్ని ఏదడిగినా సరిగ చెప్తలేరు?" అనగలిగాడు.

"అయ్యో! నీకు తెలువనే తెలువదా? రామచెంద్రం ఉరిబెట్టుకున్నడే!" అనుకుంటూ అతను పరుగెత్తాడు.

నారాయణ కొయ్యబారి పోయాడు. గుండె వేగంగా కొట్టుకుంటుండగా తలుపులు దగ్గరికి గుంజి తను రామచెంద్రం క్వార్టర్‌కేసి ఆదరబాదరాగా నడిచాడు.

రాత్రి కురిసిన కాసిన్ని చినుకులకే ఆ వీధి చిత చితలాడుతోంది. ఆ బురదలోనే కాలి నడకన పోయేవాళ్ళు, దూరపు గనుల మీదికి సైకిళ్ళతో పోయేవాళ్ళతో రోడ్డు రణగొణ ధ్వనితో నిండి పోయింది. దానికి తోడు ఒకవేపు రామచెంద్రాన్ని

చూడడానికి వెళ్ళే జనం. మరోపక్క ఎడమ వేపున గల స్టేడియంలో సాయంత్రం జరగబోయే బహిరంగ సభకు కాంగ్రెసు వాళ్ళు జెండాలు కడుతూ భారీఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. ఈ గందరగోళం చాలదన్నట్లు ఎవడో ఆటో రిక్షాలో మైకు పెట్టుకుని బొంగురు గొంతుతో "ఈ ప్రాంతం నుండి గెలిచి కేంద్ర మంత్రి అయిన ఒకాయన మొదటిసారిగా తన నియోజకవర్గాన్ని పర్యటించబోతున్నారని – వారు నూతన ఆర్థిక విధానాలను ప్రజలకు అర్థం చేయించడానికి సాయంత్రం ఏడు గంటలకు స్టేడియంలోని బహిరంగ సభలో ఉపన్యసించగలరని" గొంతు చించుకొంటున్నారు.


సదరు కాంగ్రెస్ పార్టీలోని అన్ని ముఠాల వాళ్ళు జోరుగా ఆర్చీలు, స్వాగత తోరణాలు కడుతున్నారు. మరోపక్క ఉదయం నుండే స్టేడియం చుట్టూ భారీ బందోబస్తు గురించి సాయుధ సరిహద్దు భద్రతా దళాలు, దాని పెద్ద పెద్ద వాహనాలు మోహరించి వున్నాయి. తీవ్రవాదుల కారణంగా మోహరించిన అలాంటి బలగాలు వీధంతా కలె తిరుగుతున్నారు.

ఇలాంటి సందడిలో పెద్దరోడ్డు పక్కనే వున్న రామచెంద్రం క్వార్టర్లో నుండి ఏడుపులు విన్పిస్తున్నాయి... వచ్చేవాళ్ళు, పోయేవాళ్ళు ఏం జరిగిందో తెలుసుకోవడానికి గుమిగూడుతున్నారు. మరి కొందరు విషయం తెలుసుకుని అదేదో సాధారణ విషయమేనన్నట్టు నిట్టూర్చి వెళ్ళిపోతున్నారు. మరి కొందరు కార్మికులు అసలిదేమి పట్టించుకోకుండా జెండాలు చూస్తూ వెళ్ళిపోతున్నారు. సాయుధ పోలీసులు ఏడుపులు, చావులు తమ పరిధిలోనివి కానట్టు గుమిగూడిన వాళ్ళను చెదరగొడుతున్నారు.

రామచెంద్రం క్వార్టర్ ముందుకు నారాయణ చేరుకునేసరికి కాంపౌండ్ లోపలంతా మంది నిండుకొని వున్నారు. జనంలో నుండి దారి చేసుకుని నారాయణ రేకులు కప్పిన ముందు గదిలోకి నడిచాడు. లోపలంతా చీకటిగా వున్నది. అతనికి కళ్ళు తిరిగో మరెందుకో క్షణ కాలం అతనికేమి కన్పించలేదు. పిదప సీలింగ్ ఫ్యానుకు వేలాడుతున్న మానవాకారం కన్పించింది. తనతో కలసి పనిచేసిన రామచెంద్రమేనా? నారాయణకెక్కడో మొద్దుబారిపోతోంది. "వచ్చావా నారాయణ" అన్నట్లుగా రామచెంద్రం ముఖం ఇటుకేసి తిరిగింది. నారాయణ లోలోపలి నుండి దుఃఖం చిమ్ముకొచ్చింది. ఒళ్ళంతా నీరైపోతున్నట్లుగా తోచింది.

ఎన్నో జ్ఞాపకాలు అతన్ని చుట్టుముట్టాయి. బొలబొల కన్నీళ్ళు కారుతుండగా నారాయణ వెనుదిరిగి వచ్చి గోడ పక్కనే గల సిమెంటు గద్దె మీద కూలబడ్డాడు. అక్కడ మనుషులు చేష్టలుడిగి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారు.

నారాయణకు ఏవేవో కదలాడుతున్నాయి. నలభై సంవత్సరాల సుదీర్ఘ సాహచర్యం. తనలాగే రామచెంద్రం నైజాం కాలంలో దొరల కొలువు చేయలేకా, పొట్ట చేతబట్టుకొని పర్కాల తాలూకా లోని ఒక గ్రామం నుండి కొత్తగూడెంలో 'కాలరీ' పడ్డదంటే పారిపోయి వచ్చినవాడే. అక్కడ కంట్రాక్టు లేబరుగా




పందుల గుడిసెల్లో వేలాది మందిలో తాము బతికారు. అప్పడు గనుల్లో పని ఇప్పటికన్నా అరువమోటు కష్టంతో నిండి వుండేది. నిత్యం ప్రమాదాలల్లో మనుషులు కుప్పలు కుప్పలుగా చనిపోయే వాళ్ళు. రామచెంద్రం బయపడి పల్లెకు పోతే మళ్ళా తనే వెళ్ళి ధైర్యం చెప్పి పనిలోనికి తీసుకు వచ్చిండు.

నైజాం దిగిపోయి కాంగ్రెసు వచ్చిందన్నారు. బొగ్గు పొక్కల్లో బొగ్గు తిని బొగ్గు విసర్జించే తమలాంటి వారిని పర్మినెంటు చేశామన్నారు. గోదావరి ఖనిలో కొత్తగా గనులు తవ్వుతున్నారని కొత్తగూడెం నుండి వందలాది మందిని ట్రాన్స్ఫర్ చేశారు... ఇక్కడికొచ్చి ముప్పయేండ్ల పైన్నే అయ్యుంటుంది. అప్పడు తన చిన్న కొడుకు శంకర్ పుట్టనే లేదు. రామచెంద్ర, నారాయణ గనులు వేరైనా ఒకేవీధిలో ఇద్దరికి క్వార్టర్లు దొరికినయ్.

రామచెంద్రం తట్టమోసే ఉద్యోగం చేయ లంచం పెట్టి కోల్ కట్టర్ ఉద్యోగంలోకి వ. తాను అదే దారిలో నడిచాడు. మంచికీ సెడ్డకి ఇద్దరు ఓయంటే ఓయని కలిసి మెలిసే వున్నారు. కష్టం సుఖం ఒకరికొకరు చెప్పకునే వాళ్ళు.

రామచెంద్రంకు ఇద్దరు కొడుకులు పుట్టిన తరువాత భార్య చనిపోయింది. ఆ తరువాత పిల్లల సంరక్షణకని మరో పెళ్ళి చేసుకున్నాడు. ఆమెకు మరో ఇద్దరు కొడుకులు కలిగారు. కుటుంబంలో

కాల్చుకున్నవి

"మీరు, మీ వారు నిన్న రాత్రి నలుగురితోపాటు కాల్చుకున్నామని చెబుతున్నారు కదా, మరి మీ ఇంట్లో నుంచి టపాసుల శబ్దాలేవీ విన్పించలేదేం? ఇంతకీ మీరేం కాల్చారో మా అందరికీ చెప్పి తీరాల్సిందే" పట్టుబట్టారు ఇరుగుపొరుగువారు సుందరమ్మను.

"మా వారు సిగరెట్లు..., నేనేమో మొక్కజొన్న కండెలు...." అంటూ తాము కాల్చుకున్న వైనం వివరించింది సుందరమ్మ.

–శర్మ సిహెచ్,

గొడవలు ప్రారంభమైనయ్. మొదటి భార్య కొడుకులిద్దరు సవతి తల్లితోనూ, ఆమె కొడుకులతో గొడవపడి ఇంట్లోంచి బయటకు వెళ్ళిపోయారు. వాళ్ళు అనాధలుగానే వెళ్ళారు. చదువులు పెద్దగా చదువుకోలేక పోయారు. ఏ స్థిరమైన ఉద్యోగాలు దొరకలేదు. పెద్ద కొడుకు ఎరువుల ఫ్యాక్టరీలో చాలా కాలంగా కంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఆ ఫ్యాక్టరీ నడిచేది మూసేది తెలియని సందిగ్ధంలో అతని బతుకు చావుకన్నా కడుహీనంగా ఉన్నది. అతనికి ఇద్దరు కొడుకులు. రెండో కొడుకు ప్రైవేటు లారీ మీద క్లీనర్. అతనికి పెళ్ళయ్యింది. లారీ తిరిగినట్టుగానే అతని జీవితానికి కుదురులేదు. పైగా తాగడం ఒకటి. తనేమి చేయలేక తన సంతానాన్ని ఎత్తుకోలేక, దించలేక లోలోపల ఖేదపడుతూ రామచెంద్రం విడివిడిగా ఉండేవాళ్ళ వద్దకు వెళ్ళి అయిదో పదో యిచ్చి వస్తుంటాడు.

మొదటి భార్య సంతానం వెళ్ళిపోయినా ఇంట్లో గొడవలు తగ్గలేదు. ఎప్పడన్నా మునిమాపు మేఘంలా వచ్చి ఎక్కడో మొదలేసి చెప్పకొచ్చేవాడు. "నేను నీ తీరుగ ఉంటేనే సరిపోయేది. మల్ల పెండ్లి చేసుకొని పెనం మీది నుంచి పొయ్యిల పడ్డట్టయ్యింది" దిగులుగా ఎటో చూస్తూ రామచెంద్రం.

"నేనేటి సుఖపడ్తన్న – ఉప్పిడి ఉపాసముండి పెద్దోన్ని డాక్టర్ కోర్సు సతివిత్తే ఎవతినో చేసుకొని పెట్టిన పేరు మార్చుకునె వాడు ఈ ఇంటి మొఖమే సూడకుంటయి పోయే. చిన్నోడంటావా! రేపు వాని పెండ్లామచ్చినంక వాడుగంతే కాలమే అట్ల వచ్చింది" నారాయణ

"అంతేలే ఎవని కొడుకులు? ఎవని బిడ్డలు" అని లేచి పోయేవాడు.

ఇలాంటి గొడవలకు తోడు ఉరిమి ఉరిమి మంగలం మీద పడ్డట్టు ఇప్పడు సింగరేణి ఎవనికి పుట్టినవ్ బిడ్డా అంటే ఎక్కెక్కి ఏడ్చినట్టయ్యింది. అధికారులు అందిన కాడికి మేసిండ్లు – ఓపెన్ కాస్టని పెద్ద పెద్ద మిషన్లు పరాయి దేశాల నుంచి తెచ్చిండ్లు – కార్మికుల ఉద్యోగాలకు ఎసరొచ్చింది. కేంద్రం నాకొద్దంటే రాష్ట్రం నాకొద్దంటున్నది. కార్మికులకు తమ తరువాత తమ పిల్లలకు పెట్టించుకునే హక్కు ఊడుతుందనే వదంతులు. సర్కారు చేతులెత్తేసింది మరింక ప్రైవేటోల్లే చేపడుతారని వార్తలు. కార్మికుల పిల్లలకు ఎక్కడా ఉద్యోగాలు దొరకక పోవడం. ఈ గడబిడలో ఉద్యోగాలు లేని రామచెంద్రం నలుగురు కొడుకులు రామచెంద్రం ఉద్యోగానికై పోటీపడ్డారు.

గొడవలు హెచ్చాయి. కొట్లాటలు ముదిరాయి. నలుగురు కొడుకులు తమలో తామే గొడవ పడ్డారు. నలుగురు కలిసి రామచెంద్రంతో గొడవ పడ్డారు.

రామచెంద్రంకు ఇంకా ఆరు సంవత్సరాల సర్వీసు మిగిలి ఉన్నది. పైగా ఉద్యోగం చేస్తుండగానే తనను మనిషిగా చూడని వాళ్ళు దిగి పోయిన తరువాత ఎవడూ పిరికెడు మెతుకులు పెట్టరని బాధ ఒకవేపు, కని పెంచినందుకు తన చేతిలో కల్గింది పెడుదామంటే ఏమి మిగిలింది? తన చేతులు

నరికి ఇద్దామంటే నలుగురికి ఎట్లా యివ్వడం; ఎటు చూస్తే ఏ ఆధారము లేదు.

ఆఖరి సారి కలిసినపుడు రామచెంద్రం కండ్ల నిండ నీరు నిండగా చెప్పకొచ్చిందు.

ఇటువంటివి ఎన్ని గొడవలున్నా అప్పడప్పడు బాధప డినా! ఉరిబెట్టుకునేంత పిరికివాడు కాదు. సింగరేణి జీవితంలో ఇలాంటి పెను గాడుపు దుమారులు ఎన్ననుభవించలేదు?


"నువ్విక్కడ కూకున్నవా?" జలాల్ అనే తోటి కార్మికుడు నారాయణను పలకరించాడు.

నారాయణ లేచి కాంపౌండు గోడకానుకొని నిలు చున్నాడు. తన ఒంటరి జీవితంలో రామచెంద్రం ఎంతగా అల్లుకపోయింది తొలిసారిగా అనుభూత మైంది. లోపలి నుండి రామచెంద్రం భార్య "ఎంత పనిచేత్తుకున్నవో దేవుడా! నా దేవుడా! మమ్ముల ఎక్కడ కావోల్ల జేత్తివి దేవుడా! ఓ దేవుడా! నిన్ను కడుపు నిండ తిననియ్యక పోయిరి దేవుడా! కంటి నిండ నిదుర పోనియ్యక పోయిరి దేవుడా!" సవతి కొడుకుల్ని శాపనార్థాలు పెడుతూ ఏడుస్తోంది.

నారాయణకు మనిషి బతుకు మీద రోత కల్గింది. ఈ ప్రపంచంలో ఏడుపు అబద్ధమైందేనని అది కూడా సకల స్వార్థాలతో కల్తీ అయిపోయిందని అర్ధమైంది. చివరకు రామచెంద్రం చావు కూడా గొడవే అయ్యేటట్లున్నది అనుకున్నాడు.

రామచెంద్రం మొదటి భార్య సంతానం కోసం నారాయణ కళ్ళతోనే మందిలో వెతికాడు. వాళ్ళకు ఈ కబురు అందినట్టు లేదు. కాంపౌండు బయట చిన్న భార్య పెద్దకొడుకు అంటే రామచెంద్రం మూడో కొడుకు నిలుచున్నాడు. అతని కళ్ళల్లో రవ్వంత తడిలేదు. మనుషులంతా తడి ఆరిపోయి దయ్యా లుగా మిగిలి పోయారా? అతను ఆటో రిక్షా డ్రైవరు అతనికి ఒక బాబు. అతని భార్య కరీంనగర్ లోని ఒక వోటా నాయకుని కూతురు.

అందంగా పెంచుకున్న గడ్డాన్ని దువ్వుకుంటూ వచ్చి పెద్ద మనుషులతో కాస్త పక్కకు పోయి ఏదో మట్లాడుతున్నాడు. అక్కడికి వచ్చిన వాళ్ళల్లో రామ చెంద్రం పరిచయస్తులకన్నా అతని కొడుకు పరిచయ స్తులే ఎక్కువగా కనిపిస్తున్నారు. వాళ్ళందరి ముఖాలు రామచెంద్రం అర్థాంతరపు చావుకు విసుక్కుంటు




న్నట్టున్నాయి. నిశ్చలమైన చెరువులో ఒక రాయి విసిరినట్టుగా వ్యాకులపడుతూ పోలీస్ రిపోర్టు, శవ పంచనామా తదితర పనుల కోసం బస్తీలోని ముఖ్యు లంతా గుసగుసలాడుతున్నారు.

అక్కడున్న వాళ్ళంతా పిచ్చి లేచినట్లు అటు యిటూ తిరుగుతున్నారు. ఎవరో "పోలీసులు వచ్చే దాకా పీనుగును దించకూడదా?" అన్నారు.

"దించుతె తప్పల వడ్తమ్' మరెవరో.

కాసేపటికి నాలుగో కొడుకు కొంత మందిని వెంటేసుకొని వచ్చాడు. అతను భూమికి, ఆకాశానికీ అంటకుండా మధ్యలో తిరిగే వ్యక్తిలాగా ఉన్నాడు. బజారుల్లో తల్లిదండ్రులను పీడించుకొని డబ్బులడు క్కొని జులాయిగా తిరిగే యువకుల ముఠాల్లో అత నొకడు. అతనికి తండ్రి చావు స్పృహ ఉన్నట్టుగానే లేదు.

రామచెంద్రం మూడో కొడుకు భార్య రుసరు సలాడుతూ ముందు గదిలో నుండి కాంపౌండు లోపలే గల పందిరి కిందికి వచ్చింది. చూడవ చ్చిన వాళ్ళందరిని కొరకొర చూసి తిరిగి క్వార్టర్ పక్క షెడ్డులోకి విసవిస వెళ్ళి పోయింది. ఏడుస్తున్న పిల్లవాన్ని ఒక్కటి చరిచింది, రొమ్ము నోట్లో కుక్కి.

"మంది పాడువడ మందికే అన్ని గావాలె సచ్చె టోడు చెప్పి సత్తడా? లొల్లయ్యిందో? జగడమ య్యిందా? ఎందుకురిబెట్టుకున్నడు? ఎప్పడు ఉరి బెట్టుకున్నడు? మీకేమి సప్పడు వినరాలేదా? సెక్కర్ల బడి మేముంటే పొట్లు పోదిత్తండ్లు" పిల్లవాన్ని మరో చరుపు చరిచి "నీ ఏడుపు పాడుగాను తాగరా గాడ్డి తాగు" బయటి వాళ్ళనో, పిల్లవాన్నో తెలియకుండా గొనుగుతోంది.

"సచ్చి నాయిన మా సావుకే సచ్చిందు" ఆమె పాత డీజిల్ ఇంజిన్‌లాగా లడలడ వదురుతూనే వున్నది.

రామచెంద్రం భార్య మరోవిధంగా రామచెంద్రం చావును నిందిస్తూ ఏడుస్తూనే ఉన్నది.

నారాయణకు చావు ఇంత క్రూరంగా వుండగల దని తెలిసి ఒళ్ళు జలదరించింది.

బయట జనం ఇవేమి పట్టించుకోకుండా అనేక రకాలుగా మాట్లాడుకుంటున్నారు. పాతవాళ్ళు, ఇంకా కొత్తగా వచ్చేవాళ్ళు ఒకరినొకరు అడుక్కుం టున్నారు. "అప్పల బాధా, కడుపు నొప్పా, ఇంట్ల లొల్లి జర్గిందా!, ఇంట్ల అంత మంచిగనే ఉంటారా? రెండో సమ్మందమా?" ఇట్లా కొందరు మాట్లాడు తుంటే మరి కొందరు ఆరాలు తీస్తున్నారు.

ఎవరో ఒకాయినె పక్క క్వార్టరు క్లర్కును అడు గుతున్నాడు ఆయన విసుక్కుంటూ "మేం రాత్రి బార్విలోనా ఒలింపిక్ చూస్తున్నం అసలు తెల్లారే దాకా నాకీ సంగతే తెలియదు" అంటున్నారు.

లోపలికి వెళ్ళి చూసొచ్చిన ఒక బక్క పల్చటా యన ఉరి పుట్టు పూర్వోత్తరాలు తెలిసిన వానిలాగా "ఉరి బెట్టుకుంటె గట్ల పీనుగు సెక్కు సెదురకుంట ఉండది" అనేసి అక్కడుండకుండా వెళ్ళిపోయాడు.


చావు గురించి వింటుంటే మనుషులకు అనేక విషయాలు చావకుండానే తెలిసినట్లుగా ఉన్నాయి. నారాయణకు అంతా అలుక్కపోయినట్లు గందరగో ళంగా కనిపించింది.

పొద్దు నెత్తిమీదికి రానే వచ్చింది. ఆ కాల ఖర్మానికి కేంద్ర మంత్రి ఈరోజే రావడం వలన పోలీసులు బందోబస్తులో తలమునకలై ఉండటం వలన ఇక్కడికి ఎవరూ తొందరగా రాలేకపోయారు. పోవాల్సిన వాళ్ళు స్కూటర్ల మీద పోగా రాగా ఒక సైకిల్ మోటార్ మీద ఇద్దరు పోలీసులు పొద్దు వంగుదలకు వచ్చారు.

గుమిగూడిన మందిని నిర్దాక్షిణ్యంగా దూరం కొట్టారు. వారి రాక గమనించో ఏమో స్టేడియం దగ్గరి సాయుధ పోలీసులు వచ్చి మందిని చెదరగొ ట్టారు.

ఇద్దరు కానిస్టేబుళ్ళు లోపలికి నడిచారు. ముఖ్యు లైన వారు లోపలికి నడిచారు. శవాన్ని కిందికి దించా రేమో? ఏడుపులు ఎక్కువయ్యాయి. కాంపౌండు లోపలున్న మనుషుల్లో చావు ఎక్కడో పాకినట్ట య్యింది. కొందరు వేదాంతాలు విడిచిపెట్టి కళ్ళు తుడుచుకున్నారు. కాంపౌండు ముందు ఒక ట్రాక్టరు వచ్చి ఆగింది. ట్రాక్టర్‌లో శవాన్ని వేసుకొని పోలీసులు రామచెంద్రం భార్యా కొడుకులు వెళ్ళారు. కోడలు రుసరుసలాడుతూనే ఇంట్లోకి జొరబడింది.

అక్కడుండి చేసేదేమి లేదన్నట్లు అందరు ఎటు వాళ్ళు అటు పోతున్నారు. కొందరు శవంతో పాటు పోతున్నారు. శవంతో పోతున్న కార్మికుల్లో డ్యూటీ బట్టల తోనే వచ్చిన గనిమీది యూనియన్ డెలిగేటు



నర్సింహారెడ్డి వెనక్కి తిరిగివచ్చి నారాయణకు మరో స్కూటర్ మనిషిని చూయించి "మామ, నువ్వాయి నెతోని కాస్త తిరుగు పోస్టుమార్టమ్ అయినంక పీనుగు అటు నుంచి అటే పోరింకు లైన్‌గడ్డకు (మూసివేయబడిన నాలుగో నంబరు గని కష్టాల గడ్డ) తీసుకత్తం" అని చెపుతూ "పంచనామ కూడా జల్దీ అయి పోతది వానికి" రామచెంద్రం ఆఖరు కొడుకును చూయిస్తూ "శానమంది తెల్వినోళ్ళున్నరు. అందుకని ఈ లోపట కట్టెలు తీస్కపోయి కాదు పేర్వండ్లి తెల్వినోనివి" అంటూ తనో స్కూటర్ వెనక కూర్చుండి వెళ్ళిపోయాడు.

సదరు స్కూటరు మనిషి నారాయణను వెనుక కూర్చుండ బెట్టుకొని కదిలిండు. అప్పటికి పొద్దు వంగనే వంగింది.

ఆకాశంలో అక్కడక్కడ నరికి వేలాడదీసిన శిరస్సుల్లాగున మొబ్బు తునకలు వేలాడుతున్నాయి. బజారులో మైకులు అమర్చుకున్న జీపులు బహిరంగ సభ కోసం బస్తీ బస్తీ తిరుగుతూనే వున్నాయి. కేంద్ర మంత్రికి ఆహ్వానపు ఆర్చీలు తోరణాలు కట్టడానికి, చిల్లర పనులు చేసుక బతికే వాళ్ళంతా పోయారు. కంక బొంగులు ఆర్చీల కోసం తీసుక పోతున్నారు. రామచెంద్రం లాంటి మామూలు మనిషి కాడు కోసం నారాయణ, అతని వెంట వచ్చిన స్కూటరిస్టు చాలా తంటాలు పడాల్సి వచ్చింది. కర్రలు యిచ్చే వాళ్ళు లేరు. అవి కష్టాల గడ్డదాకా తెచ్చేవాళ్ళు లేరు.

ఆ సభకు సంబంధించిన హడావిడిలో స్థానిక ఎమ్మెల్యే అతని సాయుధ రక్షకులు స్టేడియంకేసి దూసుక పోతున్నారు. మాట్లాడబోయే విషయాల గురించి, మాట్లాడే వాళ్ళ గురించి మైకులు మొత్తుకుంటున్నాయి.

మొత్తానికి ఈ గడబిడలో కర్రలు సంపాదించి పోరింకు లైను గడ్డకు కాడు పేర్చేసరికి పొద్దుగుంకే సమయం కానే అయ్యింది.

కాడు పేర్చిన మనుషులు అడవిలాగా విస్తరించిన సర్కారు తుమ్మ పొదల్లో ఒక పొద కింద కూర్చుండి చావుల గురించి అంతూ పొంతూ లేకుండా మాట్లాడుతూ సారా బత్తాలు కొడుతున్నారు. వాళ్ళందరికీ కొంచెం ఎడంగా జలాలు మోకాళ్ళ మీద తల పెట్టుకొని విచారంగా కూర్చున్నాడు. నారాయణకు అనేక సంగతులు కలగా పులగం కాగా వాళ్ళందరికి దూరంగా కూర్చున్నాడు. పొద్దంతా తనతో పాటు స్కూటరు మీద తిరిగినాయన సిగరెట్లు పాస్‌ల కోసం అయిదో నంబరు బొగ్గు గని దగ్గరి మోరి దగ్గరికి వెళ్ళాడు. ఎవరో వచ్చి నారాయణకు సారా బత్తాలు యివ్వబోతే వద్దన్నాడు. "మనిషి జల్మ మంత పాపకారి జల్మం లేదు. ఇయ్యాల్లింట్ల రేపు మంట్లె" అన్నాడు.

భూగర్భం లోనే మరో గనికి కలిపి ముఖద్వారాన్ని మూసివేసిన నాలుగో నంబరు బొగ్గు గనిలోంచి భారీ రిటన్ గాలిపంఖా ఎడతెగని శోకాన్ని భూగర్భం లోంచి తోడి పోస్తున్నట్లుగా ప్రచండ వేగంతో వింత శబ్దం చేస్తూ నిర్విరామంగా తిరుగుతోంది.

పేర్చిన కాడును, ఆ మనుషులను చూస్తుంటే సారా బత్తాల నిషాకన్నా మరో నిషా ఒళ్ళంతా ఆవరించింది. రామచెంద్రం జ్ఞాపకాలు అడుగున పడి పోతూ తన జీవితం సాంతం కుప్ప పోసుకున్నట్టుగా ఉన్నది. రామచెంద్రం పిరికి వాడనుకున్న పొద్దటి భావం స్థానే 'ఎంత సున్నితమైన మనసు గలవాడు' అనుకున్నాడు. లేకపోతే ఇలాంటి దగుల్బాజీ లోకంలో మొండి వాళ్ళు తప్ప బతుకలేరు. నిరంతరం పనిలో రెక్కలు ముక్కలు చేసుకునే వాళ్ళంతా రామచంద్రంలాగే కన్పించారు. హఠాత్తుగా నారాయణకు తాను ఒంటరి వాడిననే విషయం స్ఫురించింది. పొద్దు పూర్తిగా కుంకి పడమటి ఆకాశం నెత్తురు చల్లినట్టుగా వున్నది. ఎదురుగా తూర్పుదిక్కున భూమ్యాకాశాలు కలిసే చోటున నీటి కుండల్లాగున నల్లటి మేఘాలు పెరుక్కొస్తున్నాయి.

ఇప్పుడో అప్పుడో వర్షం వచ్చేందుకు సిద్ధంగా వున్నట్లు 'దువ్వెన్ల' గుంపు తిరుగాడుతోంది. వెనుక వైపు నుండి వివిధ గనులకు కలుపుతూ వేసిన తారు రోడ్డు మీద వందలాది లారీలు బొగ్గు నింపుకొని తన గుండెలపై నుంచి పోతున్నట్లుగా చిరచిరలాడుతూ నిరంతరాయంగా పరుగెత్తుతూనే ఉన్నాయి.

శవాన్ని పంచనామా చేయించుకొని అప్పుడొచ్చారు. జరుగవల్సిన కర్మ కాండ జరిగిపోతోంది. పెద్ద భార్య కొడుకులు రానేలేదు. వాళ్ళ గురించి అంతగా పట్టించుకున్న వాళ్ళు కూడా లేరు.

నారాయణ ఉండబట్టలేక తనకు తెలిసిన ఒక బుగ్గ మీసాలతన్ని అడిగాడు. అందులో పెద్దవాడు కాంట్రాక్టు కార్మికుల రిట్రెంచ్‌లో ఉద్యోగం పోగొట్టుకున్నాడట – వాళ్ళంతా ధర్నా చేశారట – వాళ్ళందరిని అరెస్టు చేశారట. రెండో వాడు లారీ మీద ఎటో దూర ప్రయాణం పోయాడట.


డప్పు చప్పుడు – శవయాత్ర, ఏడుపులు పెడబొబ్బలేవి లేకుండానే రామచెంద్రాన్ని కాడుపై ఉంచారు. తడిసిన కట్టెలతో కాడు ఒక పట్టాన అంటుకోలేదు. గ్యాసు నూనె కుమ్మరించి అంటించారు. కాసేపు మండుతున్న కాడును చూసి అందరు వెనుదిరిగారు.

అయిపోయింది రామచెంద్రం అనే మనిషి తండ్లాట తీరిపోయింది. మరింక రేపటి నుంచి బాయి యజమాని, బజారులో వ్యాపారస్తులు, ఇంట్లో భార్య పిల్లలు రామచెంద్రాన్ని రోజుక్కొంత పీక్కతినరు.

సమీపంలోనే వివిధ గనుల్లోంచి తోడి వేయబడే నీటి కాల్వ ఉంది. అందరు ఆ కాల్వ దగ్గరికి చేరుకున్నారు. అప్పటికే అందరు తప్ప తాగుతున్నారు. రామచెంద్రం చావు గురించి కాక తమ చావు గురించే మాట్లాడుకుంటున్నట్లుగా వరుస క్రమం లేని మాటలు. కొందరు స్నానాలు కూడా చేయకుండా పైన నీళ్ళు చల్లుకున్నారు నిషా ఎక్కడ దిగిపోగలదోనని భయం. స్నానాలు చేసిన వాళ్ళు మరిన్ని సారా బత్తాల కోసం పరుగులు పెట్టారు. మందితో పాటు నారాయణ పైవింక్ లైను మోరి దాటాడు.

నారాయణ మొదట్లో జవాబు దొరకని ప్రశ్న ఒకటి రూపుదిద్దుకొన్నది. తను ఎన్నివిధాల జవాబులు చెప్పకున్నా ఆ ప్రశ్న అంతకంతకు బాధిస్తోంది. బతుకులో ఎన్నో భయంకర గండాలు ఎదుర్కొన్న రామచెంద్రం ఉరి వేసుకునేంత పిరికివాడా? కాదు. సాధారణంగా ఇంత జీవితం చూసిన వాళ్ళు అట్లా చేయరు. ఏదో కోమలి పోరగండ్లు అంటే నమ్మవచ్చు.

అంతకంతకూ చీకటి చిక్కనౌతోంది. లో వోల్టేజీ మూలకంగా వీధి దీపాలు కొరివి దయ్యాల్లాగా మండుతున్నాయి. దక్షిణం వైపు నుండి ఎరువుల ఫ్యాక్టరీ ఆకాశంలోకి తొండం ఎత్తి ఘీంకరించే ఏనుగులాగా స్టీమ్ చప్పుడు గాలివాటుకు అప్పుడప్పుడు విన్పిస్తోంది. మూతపడిన ఫ్యాక్టరీలో తిరిగి ఉత్పత్తి ప్రారంభించేందుకు కార్మికులు విశ్వ ప్రయ



## దీపం పువ్వు

చెట్టుకు కాదు
నీటిలో కాదు
నూనెలో పూచిన పువ్వు
వత్తికాడ పువ్వు
చీకట్లో కనిపించే పువ్వు – దీపం పువ్వు
గుడిసె ముందు
మేడ మీద
అరుగుల మీద వరుసలు వరుసలుగా దీపం పువ్వులే
చీకటి ముద్రలను చిదిమి వెలుగులను పంచే
దీపం పువ్వు

ఎవడైనా దీపం పువ్వును తెంపగలడా
ముండ్లు లేకున్నా వేలును చురుక్కుమనిపిస్తుంద
రాక్షసుడు చస్తే దీపం పువ్వు పూస్తుంది
దీపం పువ్వు పూస్తే పండగ వాసనలు వేస్తుంది
దీపం పువ్వును ఎవరైనాసరే పూయించొచ్చు–
ప్రమిదలో కాస్తా నూనెపోసి
అగ్గిపుల్లను అరిచేలా చేస్తే చాలు
ఈ వ్యవస్థలో ప్రతివాడు నవ్విననాడు
పెదవి మీద దీపం పువ్వు పూస్తుంది
ప్రతి రోజును వారం వర్జ్యం లేకుండా
పండగను చేస్తుంది

–కందాళై రాఘవాచార్య

ల్నాలు మొదలు పెట్టినట్టున్నారు. సిటీ బస్సులు, ఆటో రిక్షాలు అదే పనిగా తిరుగుతున్నాయి.

వందలాది మంది కార్మికులు గుంపులు గుంపులుగా బహిరంగ సభకు స్టేడియంకేసి పోతున్నారు. తమ భవిష్యత్తు సంగతేమిటో మంత్రి గారిని అడిగి తేల్చుకుందా మంటున్నారు కొందరు. స్టేడియంలో లైట్లు ఆకాశంలోకి వెలుగులు చిమ్ముతున్నాయి. చెవులు కోసిన కుక్కలాగా మైకులో ఎవడో అదేపనిగా అరుస్తున్నాడు. చౌరాస్తాలో పోలీసులు హడావిడిగా ఉన్నారు. సాయుధ పోలీసు శకటాల్లో ఎర్రమూతి జవానులు అటూ యిటూ తిరుగుతున్నారు.

ఎటుదటే జరుగుతోంది. ఎవరి తొందరలో వాళ్ళే ఉన్నారు. ఎవరి తయారిలో వాళ్ళే ఉన్నారు. అంత మందిలో శవ దహనంలో పాల్గొన్న వాళ్ళంతా తిరిగి రామచెంద్రం క్వార్టరును చేరుకున్నారు. బలవంతం మీద నారాయణ రెండు సారా పొట్లాలు నోట్లో పోసుకున్నాడు. ఆయన కడుపులో దేవినట్లుగా వున్నది. పొద్దటి నుండి తిండి లేదు. ఆ దిక్కుమాలిన తాగుడు మధ్య, ఆ పొంతన లేని మాటల మధ్య ఉండబుద్దికాక నారాయణ ఇంటి దారి పట్టాడు. నారాయణ వెనుకే జలాలు లేచి వచ్చాడు.

వీధుల్లో జనం ఆదర బాదరాగా నడుస్తున్నారు. జలాలు వచ్చి నారాయణ భుజం మీద చెయ్యి వేశాడు. ఆ చెయ్యి వనుకుతోంది. ఇద్దరు మందిలో నడుస్తున్నారు. జలాలుది నారాయణ పక్క క్వార్టరే. జలాలు కూడా నారాయణ బ్యాచ్ వాడే. జలాలుకు ముగ్గురు కొడుకులు. మొదటి కొడుకు పాలిటెక్నిక్ చదివి ఖాళీగానే వున్నాడు. రెండో వాడు ఒక ప్రైవేటు స్కూల్లో ఉపాధ్యాయుడు. ఒక అల్లుడు బజారులో హోటలు నడుపుకుంటాడు. ఇల్లు విడిచి వెళ్ళిపోయిన జలాలు చిన్న కొడుకు గురించి పోలీసులు ఎప్పుడు వచ్చి 'కొడుకు జాడ చెప్పమని' ఆగమాగం చేసిపోతారు. కొడుకు కోసం జలాలు ఎన్నోమార్లు దెబ్బలు తిన్నాడు. అన్ని దెబ్బలు తిన్నా ఆయన మనసులో ఏముందో గాని చిన్నకొడుకు గురించి ఎవరితో ఒకమాట చెప్పడు.

బజారులో మాటలు ముద్ద ముద్దగా వినిపిస్తున్నాయి. కేకలు పిలుపులు నానా గందరగోళంగా వున్నది. బురద చితచితలాడుతోంది. గుడ్డి వీధి లైటు కింది బట్టలు చిరిగిన వాడొకడు కోపంతో ఉగ్రుడై అందరిని తిడుతున్నాడు. అతన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. దారిలో తిరుగుతున్న పోలీసులను కవ్విస్తున్నాడు. వాళ్ళకు అతనితో పని లేనట్టు అతన్నేమనడం లేదు. స్టేడియం చుట్టు పక్కల ఫ్లడ్ లైట్లు కళ్ళు మసకలు కమ్మేలాగా వెలుతురును చిమ్ముతున్నాయి. వాన మబ్బు కమ్మిన ఆకాశంలో పడమటి వేపు ఒంటరి నక్షత్రం మాత్రం మినుకు మినుకుమంటోంది.

నారాయణ అలిసిపోయిన మ..నిషిలాగా నడుస్తున్నాడు. పక్కనే జలాలు నడుస్తున్నాడు. జలాలు చెయ్యి ఇంకా నారాయణ భుజం మీదనే వున్నది. జలాలు తను ఆగి నారాయణను ఆపిండు. గుడ్డి వెలుతురులోనే నారాయణ కళ్ళల్లోకి చూస్తూ ఏదో చెప్పాలని మాటలు రాక జలాల్ యాతన పడ్డాడు. చివరకు "ఎట్ల జర్గిందో నీకు తెల్సిందా?"

"ఏంటిది?" నారాయణ

"రామచెంద్రం నిజెంగ ఉరిబెట్టుకున్నాడను కుంటన్నవా?"


"మరి"

"అరె బయి సంపేసిండ్లు – ఉరి బెట్టిండ్లు." జలాల్ చుట్టూ చూశాడు.

"సంపినంకనా?" నారాయణ అదో విధమైన గొంతుతో

"ఔ. నిన్న రాత్రిల ఇంట్ల కిరికిరి జర్గిందట. పెండ్లాం ఇద్దరు కొడుకులూ ఉద్యోగంల నుంచి దిగిపొమ్మని కూసున్నరట. రామసెంద్రంకు కోపం వచ్చి దిగిపోతే పెద్ద భార్య కొడుకుల్ల ఒకనికే తన ఉద్యోగం ఇస్తనన్నడట. ఇక చూస్కో అందరు రామచెంద్రం మీదికురికిండ్లట. వాడు ఆసిన్న గుండగాడు లేడూ వాడు ఉరికచ్చి రామసెంద్రం రొంబొచ్చెల తన్నిండట. గోడకు కూసున్న రామసెంద్రం అట్లనే పానమిడిసిండట. కోడలచ్చి తలుపులు మూసిందట. పక్కోల్లకు ఎరికే ఉన్నట్టున్నది."




నారాయణకు కాళ్ళ కింది నేల గిర్రున తిరిగినట్టయ్యింది.

"లాష్ (శవం) చూస్తేనే వాకనుమానమచ్చింది. ఉరి బెట్టుకుంటె నాలిక ఈతలికెల్లుతది. కదుపుల కసరు ఎనుక కెల్లుతది. మెడబొక్క ఇరుగుతది. పోలీసోల్లు బగ్గ తిన్నరు. వాళ్ళకంత ఎరికే" ఇంకా జలాల్ ఏదో చెప్తతున్నాడు.

నారాయణ కొద్దిగా తూలుతూ నాలుగడుగులు వేశాడు. క్వార్టర్ వచ్చింది. క్వార్టర్ ముందు చీకటిగా వున్నది. జలాల్ భరించ లేనట్లుగా గబగబ వెళ్ళిపోయాడు. వేసిన తాళం వేసినట్టుగానే వున్నది. అంటే కొడుకు ఇంకా రాలేదన్న మాట. తాళం తీసి లోపల లైటు వేశాడు. ముందు గదిలో నవారు తెగి జోలె పడిపోయిన కొడుకు మంచం ఉన్నది. వాని బతుకులాగే ఆ గది చిందర వందరగా వున్నది. విప్పి పారేసిన బట్టలు గదంతా నిండి ఉన్నాయి.

నారాయణ గబగబ వంట గదిలోకి నడిచి లైటు వేశాడు. పొద్దున తను వండిన అన్నం అట్లాగే ఉన్నది. కొడుకు ఇంటికి రానేలేదు. బహిరంగ సభకు పోయిండా?

మన:సంతా దిగులు పాకింది. రెండు రోజులయ్యింది కొడుకు ఇంటికి రాక. ఇంట్లోంచి అలిగి పోయిండు. కొడుకు అలగడం మామూలే. కానీ ఈసారి అలిగింది మాత్రము తనను ఉద్యోగంలో నుంచి దిగిపోయి ఆ స్థానంలో తనను పెట్టించమంటాడు. ఈ ఒక్క అవకాశము ఉంటుందో పోతుందో తెలియదు కనుక వీలైనంత తొందరగా పెట్టించమంటాడు. అన్న చదువుకే మొత్తం ఖర్చు పెట్టి తనకు చిప్ప చేతికిచ్చావంటాడు. ఇప్పుడు జలాల్ కొడుకుతో పాటు ప్రైవేటు స్కూల్లో ఎంతిస్తరో గాని బట్టలకే సరిపోవు. తనేమి మాట్లాడలేదు. కన్నందుకు ఈకాస్త చేస్తే తన కర్తవ్యం నెరవేరుతుంది. వాడికి పెళ్ళి, పెళ్ళాం కావాలి. కాని తనకు ఏమాధారం? లక్షలాది మందిలో తిరుగుతున్న ఒంటరి గానే మనిషి మిగిలి పోతున్నాడు.

ఊరు ఎన్నడో ఎల్లదన్నింది. భూమా జాగా అక్కడేం ఉన్నది? ఇన్ని రోజుల సంపాదన తిండి, బట్టకు, కొడుకుల సదువులకే సరిపోయింది. రెక్కలు బొక్కలు తెల్లవడి ఇప్పుడు తన ఉద్యోగం వదులుకుంటే ఉండేదానికి ఇల్లెక్కడ? పెద్దోడు రానయ్యాడు. వీడు పెండ్లి చేసుకుంటే గంతే. వచ్చే డబ్బు ఏ మూలకు సరిపోతుంది? తను ఒంటరి జీవితం గడిపేదెట్లా? ఇన్నాళ్ళూ తను బాగుపడ్డానే అనుకున్నాడు. తనకు మరో అయిదు సంవత్సరాల సర్వీసున్నది. పెద్ద కొడుకు మీద పెట్టుకున్న ఆశలు విరిగిపోయాయి. కనీసం ఉన్నవా సచ్చినవా అని అరుసుకునే స్థితిల లేడు.

ఇటు చూస్తే రోజు రోజుకు పరిస్థితులు మారుతున్నాయి. గనులు నష్టాలు వస్తున్నయిగన్క మూస్తరంటున్నారు. ఉన్న బాయిలను ఓపెన్ కాస్టు చేసి మిషన్లు దించుతనంటున్నరు. అనేక మందిని ఉద్యోగాల నుంచి తీసేస్తనంటున్నరు. ఎవరికి అందినకాడికి వాళ్ళే మేసేసిండ్లు అంటున్నరు. బాయిల మీద తుపాకులు పట్టుకున్న మిల్ట్రి వాళ్ళు దిగుతున్నారు. ఏం జరుగుతోందో ఎవరికి తెలియడం లేదు. అంతా ఒక అనిశ్చిత పరిస్థితి. పద్ధతి ప్రకారంగానైతే మరో అయిదేండ్లు చెయ్యాలి తను. పోనీ నాలుగేండ్లు చేసి ఒక్క సంవత్సరం ముందుగా దిగిపోయి కొడుకును పెట్టించవచ్చు. కాని ఇప్పుడు ఏదీ అర్థం కావడం లేదు.

నారాయణకు రెండు రోజుల క్రితం జరిగిన గొడవ జ్ఞాపకం వచ్చింది. అసలే తనకు ఎటూ తోచకుండా వున్న సమయంలో వాడు ఆ ప్రస్తావన తెచ్చాడు. మాట మాట పెరిగింది.

"అయితే నువ్వే చేసుక బతుకు" అంటూ కొడుకు విసురుగా ఉరుములు మెరుపులు కుండపోతగా కురుస్తున్న వర్షంలో కట్టుబట్టలతో తడుస్తూ వెళ్ళిపోయాడు.

తను మాట పడిపోయిన వానిలాగా చూస్తుండిపోయాడు. ఆ రాత్రంతా నిదుర పట్టలేదు. గొడుగేసుకుని తనకు తెలిసిన జాగాలల్లో వెతికి వచ్చాడు. మరునాడు డ్యూటీకి పోయినా మనసంతా కొడుకు మీదనే వున్నది. 'వాడే వస్తాడని' ఎంత సమాధానపడినా కొడుకు రాలేదు.

నారాయణకు ప్రాణం విలవిలలాడింది. అన్నానికి చీమలు పట్టాయి. కడుపు కాలిపోతున్నా తినబుద్ధి కాలేదు. తొలిసారిగా నారాయణకు బతుకు మీద రోత కల్గింది. దుఃఖం కడుపులో ఎగదన్నుతోంది.

కొడుకు వస్తాడేమోనని తలుపు జారేసి మంచంలో నడుం వాల్చాడు. మైకులో ఏవేవో పిచ్చి మాటలు – వీధిలో సభకు పోతున్న జనం అడుగుల చప్పుడు – పొంతన లేని మాటలు. ఏయేయే ఆసక్తులు వాళ్ళను అట్లా తిప్పుతున్నాయో తెలియదు. కొడుకు గినకవస్తుడుతాడేమొ తను రెండడుగులు వేస్తే సభ దగ్గరికి పోవచ్చు. కాని నారాయణ లేవలేక పోయాడు.

కొద్ది నిముషాల్లో బహిరంగ సభ ప్రారంభం కాబోతున్నదని ఎవరో అరిచి చెప్తున్నారు. మంత్రి గారు వచ్చేస్తున్నారు జనం ప్రశాంతంగా కూర్చుండవలసిందిగా విజ్ఞప్తులు. మధ్య మధ్య దేశభక్తి గీతాలు.

ఎక్కడో దూరం నుంచి తొమ్మిది గంటల సైరన్ భయంకరంగా కూసింది. దట్టంగా ఆవరించిన వర్షాకాలపు రాత్రి ఆ సైరన్ కూత కార్మికుల గుడిసెలను బస్తీలను చుట్టుముట్టింది.

నారాయణ ఈ శబ్ద ప్రపంచాన్ని పట్టించుకోనట్టు మంచంలో వెల్లకిలా పడుకున్నాడు. హఠాత్తుగా ఫ్యాన్ రాడ్‌కు వేలాడుతున్న రామచంద్రం మైకులో నుంచి మాట్లాడుతున్నట్లుగా భ్రమ కలిగింది... వద్దు. వద్దు... నారాయణ ఏండ్ల పడెంత్యం సాగిన తన జీవితానికి మొదలెక్కడో వెతుక్కునే ప్రయత్నంలో కండ్లు తెరిచే ఉన్నాయి. మండుతున్నాయి. తండ్రి పటేలు పొలంలో పాము కరిచి చనిపోయిండు. తల్లి తనను మరిద్దరిని వీపుకు కట్టుకొని సాదింది. పగలంతా కూలికి పోయిన తన తల్లి కోసం మూడు నాలుగేండ్ల వయసప్పుడు తానెంత తపిస్తూ ఎదురు చూసేవాడో జ్ఞాపకం వచ్చింది. తానే చిన్న పిల్లవాడై ఉండి తనకంటే పసిగుడ్లను ఓదార్చడం – తాను వాళ్ళతో పాటు గొంతు కలిపి ఏడ్వడం. సంవత్సరాల తరబడి ఎండకు ఎండి వానకు చీకి నల్లబడిపోయిన శరీరంతో పొద్దు పొడిచింది మొదలు పొద్దుగూకే దాకా దొరల పొలాలల్ల రెక్కలు ముక్కలు చేసుకుని ఇంటికి వచ్చేది. తమను గుండెల కదుముకుని ఏడ్చేది. నారాయణకు తెలియకుండానే కళ్ళల్లో నీళ్ళు కారసాగినయ్.

కటిక పేదరికం – తీరని ఆకలి ఎడతెగని దుఃఖం ఆ ఊరు గురించీ, ఆ జీవితం గురించీ మననం చేసుకోవాల్సింది ఏమున్నది గనుక. నారాయణ తల్లి జ్ఞాపకాలు సాగిసాగి అలిసిపోయే దాకా ఏడుస్తూనే ఉన్నాడు. అది నిద్రో మెలుకువో రెండూ కాని స్థితో తెలియదు.

నారాయణ అట్లా బాల్యంలో నుండి ఏమాత్రం సుఖ సంతోషాలు లేని దౌర్భాగ్యపు యవ్వనకాలపు పాలేరు జీవిత జ్ఞాపకాల్లోకి జారుకున్నాడు.

నారాయణ ఎక్కడో పోగొట్టుకున్న తన పచ్చ పచ్చని జీవితంలోని ఒకటి రెండు జ్ఞాపకాలు మెరిశాయి. పచ్చిక మీది నుండి కొంగు నడుముకు చుట్టుకొని కోతలు కోసిన కొడవలి చేతపట్టుకుని ఆర్తిగా తన కోసం పరుగులిడుతూ తన తల్లి వస్తోంది. నారీ! నా నారీ! ఎలుగెత్తి పిలుస్తోంది. ఎంత పరు

గెత్తినా తన వద్దకు చేరుకోవడం లేదు. తను తన తల్లికేసి దుఃఖంతో చేతులు చాచి నోరు బొంగురు పోయేదాకా పిలుస్తున్నాడు. పిలువగా పిలువగా తన కంఠం పూడుక పోయింది.

హఠాత్తుగా తన గొంతునెవరో పిసుకుతున్నారు. రూపం లేని యువకుడు తన మీదికంటా వంగి తన గొంతు పిసుకుతున్నాడు. నారాయణ ఊపిరాడక గిజగిజ తన్నుకుంటున్నాడు. అరవడానికి గొంతు రావడం లేదు. ఆ చేతుల స్పర్శ తెలుస్తోంది. ఆ చేతుల స్పర్శ తనకు చిర పరిచితమైందే. ఆ మనిషి నుంచి వచ్చే వాసన తనకు పుట్టుక తోనే తెలిసిందే. ఆ చేతులు తన గొంతు మీద బిగుసుకుంటున్న ఆ చేతులు. తన కొడుకు చేతులే. తల్లి లేని ఆ చేతులను పట్టుకొని ముద్దులాడాడు. తాను ఆ చేతులు పట్టుకొనే వీధులన్నీ తిప్పాడు. వాడే తను పెంచిన చేతులే తన గొంతు పిసుకుతున్నాయి.

నారాయణ దిగ్గున మంచం మీద లేచి కూర్చున్నాడు. కలో భ్రాంతో తెలియక ముందు గదిలోకి ఉరికి చూశాడు. కొడుకు లేదు. కుక్క ఒకటి లోపలికి వచ్చిందేమో బయపడి బయటకు పరుగెత్తింది. నారాయణ ఇంటి ముందుకు పోయి నిలుచున్నాడు. అదంతా కలే అయ్యి వుంటుంది. తన భ్రమే అయ్యి ఉంటుంది.

కొద్దిగా స్థిమిత పడ్డాడు. కాని దిగ చెమటలు కారుతున్నాయి. నాలుక పిడుచ గట్టుకపోయింది. వంట గదిలోకి పోయి నీళ్ళు తాగిండు. ముందు గదికి గొళ్ళెం వేద్దామనుకున్నాడు. కాని వేయకుండానే దగ్గరికి చేరవేసి మళ్ళీ వచ్చి మంచంలో నడుం వాల్చాడు.

స్టేడియం గ్రౌండ్‌లో మంత్రిగారు కాబోలు వింపాదిగా ఏదో చెప్తతున్నాడు. అప్పడు టైమెంతయ్యిందో?

నారాయణ మెదడు పని చేయడం లేదు.

మంత్రి గారు మధ్య మధ్యలో ఘర్జిస్తూ తమ ప్రభుత్వం హరిజనులకు, గిరిజనులకు, కార్మికులకు ఎంతెంత చేసిందో వివరిస్తున్నాడు. దేశం చిక్కుల్లో ఉందన్నాడు. బయటా, ఇంటా విచ్ఛిన్నకర శక్తులు పొంచి ఉన్నాయన్నాడు. తీవ్రవాదులు చీటికి మాటికి సమ్మెలు చేయించడం వలన సింగరేణి పరిస్థితి దిగజారి పోయిందన్నాడు... ఆ తరువాత భీకరమైన అరుపులు గొడవలు విన్పించాయి. కార్మికులు పెద్ద పెట్టున అరుస్తున్నారు. పెఢీ పెడిన వినాదాలు...

ఆ తరువాత కొద్ది సేపటికి మళ్ళీ మంత్రి గొంతు విన్పించింది. "శాంతించండి. నిజమే పారిశ్రామిక పరిస్థితులు అధ్వాన్నంగా వున్నాయి. అవినీతికి పాల్పడ్డ ఉద్యోగులను తొలగిస్తున్నాం. దొంగతనాలు అరికట్టేందుకు సెక్యూరిటీ ఫోర్సును దించాము"

"కాదు. కాదు" వేల కంఠాలు అరిచాయి.

నారాయణకిదంతా గందరగోళంగా వున్నది. ఆ లొల్లేమిటో పోదామా అనుకున్నాడు. ఆ గుంపులో తన కొడుకున్నాడేమో అనుకున్నాడు. అసలే సాయుధ పోలీసులు – ఇదంతా ఎట్ల ముగుస్తుందో? కాని లేవలేక పోయాడు. సర్వశక్తులు ఉడిగి పోయినట్లుగా తోచింది. మంచంలో అటు యిటు తిరిగి పడుకున్నాడు. తలలో విపరీతమైన పోటు. జ్వరం వచ్చిందా?

ఆ చీకట్లో పైకప్పకేసి చూశాడు. సీలింగ్ ఫ్యాను తిరుగుతోంది.

మంత్రి ఏదో చెప్తతున్నాడు. హఠాత్తుగా సీలింగ్ ఫ్యానుకు రామచెంద్రం వేలాడుతూ "మీరే మాకు ఉరి పెడుతున్నారు" అరుస్తున్నాడు.

నారాయణ దిగ్గున మంచంలో లేచి కూర్చున్నాడు. వీధిలో గబ్బెడ గబ్బెడ మంది ఉరుకుతున్న చప్పడు. కిటికీ తీసి చూశాడు. కార్మికులు పరుగెత్తుతున్నారు. సాయుధ పోలీసులు తరుముతున్నారు. మంత్రి గారు ఇంకా ఏదో మాట్లాడుతూనే వున్నాడు. గందరగోళపు వినాదాలు కొనసాగుతూనే వున్నాయి.

నారాయణ మంచంలో తల పట్టుకొని కూర్చుండి కొడుకు కోసం ఎదురు చూస్తున్నాడు. చిత్రంగా ఉరితాడు కొస మొదలు ఎవరి చేతిలో ఉన్నాయి అనే ఆలోచన వచ్చింది.

నారాయణ కొడుకు కోసం రాత్రంతా ఎదురు చూస్తూనే ఉన్నాడు. నారాయణకు నిద్రరాదు. కొడుకు ఇంటికి రాడు. ■

